సాక్షి నంద్యాల

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలం: భ్రమరాంబాదేవికి బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పం పఠించారు.



సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి బుధవారం 250 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.



అన్నదానానికి బియ్యం విరాళం

మహానంది: నంద్యాల మండలం కొత్తపల్లెకు చెందిన రైతులు 130 బస్తాల బియ్యాన్ని మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:46
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:49
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:49
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:43
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:43

హదీస్ వెలుగు :
రోజా దీక్ష ఉండి హలాల్ ఆహారంతోనే ఇఫ్తార్ చేయండి. హరామ్ ఆహారంతో ఇఫ్తార్ చేస్తే పగలంతా పస్తు ఉండటం తప్ప పుణ్యం లభించదు. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్


'జగనన్నే మా భవిష్యత్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల(అర్బన్): జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ పోస్టర్‌ను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా రవి నివాస గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రతి ఒక్కరికి వివరించేందుకు తలపెట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమమే జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, బెస్త సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కల్లూరి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం : పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలగిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ జరిపించారు. ఆ తర్వాత స్వామిఅమ్మవార్ల పల్లకీని ఊరేగింపుతో శ్రీశైలగిరి ప్రదక్షిణకు తోడ్కొని వచ్చారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నంది మండపం, మల్లికార్జున సదన్, బయలు వీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి రింగ్‌రోడ్డు మీదుగా గణేష సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నంది మండపం వద్దకు, అక్కడ నుంచి ఆలయ మహాద్వారం వద్దకు గిరిప్రదక్షిణ చేరుకుంది.

కల్యాణం..కమనీయం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో గోదాదేవి, ప్రహ్లాదవరదస్వాముల కల్యాణం ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో కమనీయంగా సాగింది. గోదాదేవి అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తర పాల్గుణ నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి గోదాదేవి అమ్మవార్లను కొలువుంచి నవకలశస్థాపన పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి కొలువుంచారు. గోదాదేవి అమ్మవారిని ప్రహ్లాదవరదుడిని పెళ్లిపీటలపై ఆశీనులను చేసి మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. మాంగల్యధారణ అనంతరం ముత్యాల తలంబ్రాలు పోశారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పల్లె ముంగిటే సంపద

చెత్తతో సంపదను సృష్టించుకుంటూ కాదేదీ వృథా అన్నరీతిలో పల్లెలు ముందుకు సాగుతున్నాయి. తమను తాము పరిశుభ్రంగా ఉంచుకుంటూనే పంచాయతీలకూ ఆదాయం చేకూర్చిపెడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని సంరక్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న స్వచ్ఛ సంకల్పం'లో ఇదంతా సాధ్యమవుతోంది. ఇప్పటికే ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) ఏర్పాటయ్యాయి. ఆయా గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆ చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతోంది. – కోవెలకుంట్ల

- పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ
- పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి
- తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు తయారీ
- జిల్లాలో 301 చెత్త సంపద కేంద్రాలు
- సంపద కేంద్రాలతో సమకూరుతున్న ఆదాయం



కోవెలకుంట్లలోని ఘనవ్యర్థ పదార్థాల సంపద కేంద్రం



తడి, పొడి చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేస్తున్న క్లాప్‌మిత్ర

జిల్లాలో 29 మండలాల పరిధిలో 489 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు 301 ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 1,461 మంది క్లాప్ మిత్రలు, 301 మంది షెడ్‌మిత్రలు పనిచేస్తున్నారు. వీరంతా గ్రామాల్లోని వారికి కేటాయించిన కాలనీల్లో చెత్త తరలించే రిక్షాల్లో ఉదయం 6 గంటల నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరించి ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలకు తడిచెత్త, పొడిచెత్త సేకరణకు ఒక్కో మున్సిపాల్టీకి రెండు, మేజర్ పంచాయతీలకు ఒకటి చొప్పున ఎలక్ట్రానిక్ ఆటోలు సరఫరా చేశారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటమేగాకుండా ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతూ గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూరుతోంది. క్లాప్ మిత్రలు గ్రామాల్లోని ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల్లో తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, గాజు సీసాలు, పనికిరాని గుడ్డముక్కలు, చెప్పులు, బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, సబ్బు, గుట్కా, బిస్కెట్, పాలకవర్లు, పాడైన బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పనికి రాని నోటు పుస్తకాలు, అట్టపెట్టెలు, బట్టలు, ఇనుప, స్టీలు తదితర ఘన పదార్థాలను 13 రకాల తొట్లలో నింపి నెలకోసారి విక్రయిస్తున్నారు. కుళ్లిపోయే స్వభావమున్న పశువుల పేడ, మిగిలిపోయిన ఆహార పదార్థాలు, కొబ్బరి పీచు, కూరగాయల తొక్కలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి, వంటగదుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థ పదార్థాలను ప్రత్యేక తొట్లలో లేయర్లుగా విభజించి అందులో 45 రోజులపాటు వానపాములు వదిలి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి కిలో రూ.10 చొప్పున విక్రయించి ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఏడాదికి మేజర్ పంచాయతీలు రూ.3 లక్షలు, మైనర్ పంచాయతీలకు రూ.1.10 లక్షల నుంచి రూ.1.20 లక్షల ఆదాయం చేకూరుతోంది. 15వ ఆర్థిక సంఘం, స్టేట్‌ఫైనాన్స్, ప్రభుత్వ నిధులతో పాటు ఈ మొత్తాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

క్లాప్, షెడ్ మిత్రలకు జీవనోపాధి

జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా క్లాప్, షెడ్ మిత్రలు జీవనోపాధి పొందుతున్నారు. వీరి పని ప్రతిరోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించడం, సాయంత్రం వేళల్లో ఆయా కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం. మిగిలిన వేళల్లో వ్యక్తిగత, ఇతర పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి.

జిల్లాలో మండలాల సంఖ్య	29
గ్రామ పంచాయతీలు	489
సంపద కేంద్రాలు	301
చెత్త సేకరణకు నియమించిన క్లాప్‌మిత్రలు	1,461
సంపద కేంద్రాల్లో షెడ్ మిత్రలు	301

పరిశుభ్రత, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

గతంలో రోడ్లపై, ఇళ్ల పరిసరాల్లో, డ్రెయినేజీల్లో పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతూ, దోమలు, పందులు స్వైర విహారంతో ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడేవారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంతో స్వచ్ఛ గ్రామాలుగా మారిపోయాయి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్లు సరఫరా చేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా క్లాప్ మిత్రలు ఆయా కాలనీల్లోని ఇళ్ల నుంచి సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను కేంద్రాలకు తరలిస్తుండటంతో వీధులు, మురుగు కాల్వలు పరిశుభ్రయ్యాయి. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, క్లాప్ మిత్రల పనితీరును ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తూ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తుండటంతో చెత్తరహిత గ్రామాలుగా రూపుదిద్దుకున్నాయి. ప్రతి శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డీఎల్‌పీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో జరిగే పారిశుధ్య కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణకు మండల, జిల్లా స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజలు పారిశుధ్యంపై కంటోల్ సెంటర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

ప్రజలు సహకరించాలి



ఇళ్లలోని చెత్త, చెదారం, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్లలో వేసుకుని ఇళ్ల వద్దకు క్లాప్ మిత్రలు వచ్చినప్పుడు చెత్త రిక్షాల్లో వేసి సహకరించాలి. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రిక్షా ద్వారా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి అక్కడ వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నాం.
– సారమ్మ, క్లాప్‌మిత్ర, కోవెలకుంట్ల

సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారీ



మేజర్ పంచాయతీ పరిధిలో మాకు కేటాయించిన ఇళ్ల వద్ద నుంచి చెత్తను సేకరించి పట్టణ శివారులోని చెత్త సంపద కేంద్రానికి తరలిస్తున్నాం. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొట్లలో నింపి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నాం. అధికారులు ఎప్పటికప్పుడు సంపద కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు.
– నాగరాజు, క్లాప్‌మిత్ర, కోవెలకుంట్ల

పరిశుభ్రంగా గ్రామాలు

జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 12 గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.
– రాధిక, ఈఓపీఆర్‌డీ, కోవెలకుంట్ల



ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్న దృశ్యం

టూరిజం అభివృద్ధికి పెద్దపీట

మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతాం ● ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డితో కలిసి పార్కును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.75 లక్షలతో నెహ్రూనగర్‌లో నిర్మించిన పార్కును బుధవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. వెంకటాపురం తుమ్మలచెరువు వద్ద బోటింగ్, టూరిజం అభివృద్ధికి రూ.3 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అతి పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులతో పాటు టూరిజం అభివృద్ధికి పెద్దమొత్తంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. 1,700 ఎకరాల ఆయకట్టును 5వేల ఎకరాల ఆయకట్టుగా స్థిరీకరించేందుకు హంద్రీనీవా నీటితో వెంకటాపురం చెరువును నింపుతున్నామన్నారు. కొత్తకోట వద్ద డ్రైవింగ్‌లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఐటీడీఆర్ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ప్యాపిలిలో ఇంటిగ్రేట్ మార్కెట్, గొర్రెల పెంపకంపై శిక్షణ కేంద్రం, వెటర్నటీ కళాశాల ఏర్పాటు, వెంగలాంపల్లె చెరువు అభివృద్ధికి చర్యలు, ప్రతి గ్రామానికి నూతన రోడ్లు నిర్మించడం సీఎం వైఎస్ జగన్ చొరవతోనే సాధ్యమైందన్నారు. మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దేందుకు సీఎం అన్ని విధాలా సహకరిస్తున్నందుకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. బెలుం గుహల తరహాలో నియోజకవర్గంలోని వాల్మీకి గుహలు, బిల్లెల స్వర్గం గుహలను అభివృద్ధి చేసేందుకు రూ.5.50 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. సమావేశంలో టూరిజం మేనేజర్ ఈశ్వరయ్య, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, సర్పంచ్ బోయ రాణి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల బాంధవుడు బాబూ జగ్జీవన్‌రామ్

● ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి, జిల్లా అధికారులు, దళిత సంఘం నాయకులు

నంద్యాల: బడుగు, బలహీన వర్గాల బాంధవుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ డీడీ చింతామణి, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విక్టోరియా రీడింగ్ రూంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ బిహార్ రాష్ట్రంలో జన్మించి బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు వివక్షతకు గురైన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నిక కావడమే కాకుండా అనేక శాఖల్లో మంత్రి, కేంద్ర మంత్రి, ఉప ప్రధానిగా పదవులు అలంకరించి అణగారిన వర్గాల సంక్షేమానికి పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని సొసైటీకి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వివిధ సంఘాల నాయకులు సివి సుబ్బయ్య, దండు వీరయ్య, బీసీ సుబ్బరాయుడు, కొమ్ముపాలెం శ్రీనివాసులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

● స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో బాబు జగ్జీవన్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ



వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

రంగనాథా.. నమోస్తుతే!

- కనుల పండువగా తర్తూరు లక్ష్మీరంగనాథుని రథోత్సవం
- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం స్వామివారి రథోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెక్కబొమ్మ రూపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణువును ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి బంగారు తొడుగుతో అలంకరించి, విశేషపూజలు నిర్వహించారు. పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కూర్చోబెట్టి గ్రామంలోని వివిధ దేవతామూర్తుల ఆలయాలవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథంపై కొలువుంచారు. ఆయకట్టుదారులు కుమ్మరులు భోనం తీసుకురాగా రథం ముందు పూర్ణాహుతి బలి ఇచ్చారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లికార్జునరెడ్డి స్వామివారికి, రథానికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు గోవిందనామాన్ని స్మరిస్తూ రథాన్ని ముందుకు లాగారు. రథశాల నుంచి 100 మీటర్ల దూరం లాగి తిరిగి రథశాల వద్దకు చేర్చారు. శ్రీమహావిష్ణువురూపుడైన శ్రీలక్ష్మీరంగనాథుడు రథోత్సవాన్ని తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు వీక్షించి పరవశించిపోయారు. అంతకుముందు తమ ఇంటి ఇలవేల్పు లక్ష్మీరంగనాథుడికి భక్తులు వారి పొలాల్లో పండించిన బియ్యం, బ్యాళ్లు, కందులు, మినుములు తదితర ధాన్యాలను సమర్పించారు. మరికొందరు రైతులు భక్షాల బండ్లతో వచ్చి నైవేద్యం సమర్పించారు. పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకున్నారు.



రథంపై ఆశీనుడైన శ్రీలక్ష్మీరంగనాథుడు

పింఛన్లు 96.39 శాతం పూర్తి

నంద్యాల(రూరల్): జిల్లాలో పింఛన్ల పంపిణీ బుధవారం సాయంత్రం నాటికి 96.39 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ – ఐకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 6 మున్సిపాలిటీలు, 29 మండలాల్లో ఉన్న 2,16,136 మంది లబ్ధిదారులకు గానూ 2,08,333 మందికి అందజేశామన్నారు.

15న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 15న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశాల్లో చర్చించేందుకు వీలుగా ఆయా శాఖల తాజా అభివృద్ధి నివేదికలను తెలుగులో 30 కాపీలను ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు.

మేనిఫెస్టో లేని పాదయాత్రలను ప్రజలు నమ్మరు



జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: మేనిఫెస్టో లేని పాదయాత్రలను ప్రజలు నమ్మరని, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఒట్టిపోయిన బర్రెలాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఈ నెల7 నుంచి 20వ తేది వరకు గ్రామాల్లో నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్ఆర్ కుటుంబం పాదయాత్ర చేస్తున్న సమయంలో మీరు అధికారాన్ని కట్టబెడితే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తాము సిద్ధమని ప్రకటించారన్నారు. అందులో భాగంగా దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను, మేనిఫెస్టో ప్రకటించిన హామీలన్నింటినీ దాదాపుగా అమలు చేసిన సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. కరోనా కారణంగా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ హామీలను క్యాలెండర్ ప్రకారం క్రమం తప్పకుండా అమలు చేయడం ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

విద్యార్థిని అదృశ్యం



భార్గవి (ఫైల్)

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు నందివర్గం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చౌడమ్మ కూతురు భార్గవి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 3న ఉదయం బనగానపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల వద్ద, తెలిసిన చోట్ల విచారించినా ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థిని తల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరికైనా విద్యార్థిని ఆచూకీ తెలిస్తే 91211 01098 నంబరుకు తెలియజేయాలన్నారు.

తగ్గిన రాబడి!

- లక్ష్య సాధనలో వెనుకబడిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.406 కోట్ల ఆదాయమే లక్ష్యం
- వసూలైంది మాత్రం రూ.306 కోట్లే
- ఆశించిన మేర పుంజుకోని రియల్ ఎస్టేట్



కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం



కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ, విక్రయదారులు

కర్నూలు(సెంట్రల్): స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం భారీగా క్షీణించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.406 కోట్ల మేరకు ఆదాయ లక్ష్యం నిర్దేశించగా రూ.306 కోట్ల మేరకు మాత్రమే సాధించింది. పోయిన సంవత్సరంతో పోల్చుకుంటే వృద్ధిరేటు మైనస్‌లోకి పడిపోయింది. లక్ష్య సాధనలో కర్నూలు జిల్లా వెనుకబడి పోవడంపై ఆ శాఖ అధికారులు పలు కారణాలను విశ్లేషిస్తున్నారు.

లక్ష్యానికి చేరువ కాలేక...

2022-23 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.406.46 కోట్ల ఆదాయం స్వీకరణే లక్ష్యంగా నిర్దేశించారు.అయితే, పలు ఒడిదుడుకుల కారణంగా రూ.306.19 కోట్ల ఆదాయం మాత్రమే స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల ద్వారా లభించింది. మొత్తంగా 1,30,618 దస్తావేజుల ద్వారా జరిగిన ఆదాయ స్వీకరణలో 75.33 శాతం మాత్రమే సాధ్యమైంది. ఇది గతేడాదితో పోల్చుకుంటే చాలా తక్కువ. వృద్ధి రేటు కూడా -2.93 శాతం నమోదైంది. 2021-22 (గతేడాది) సంవత్సరంలో కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో రూ.384.97 కోట్లను లక్ష్యంగా నిర్దేశించగా రూ.356.75 కోట్లను స్థిర, చరాస్తుల అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా ఆదాయం రాబట్టారు. మొత్తంగా కర్నూలు పరిధిలో 92.66 శాతం ఆదాయం నమోదైంది. ఈ ఆదాయం 2020-21లో వచ్చిన రూ. 259.05 కోట్ల కంటే 37.70 శాతం అధికవృద్ధిరేటు సాధించింది.

ఒకే ఒక్క ఎస్ఆర్ఓలోనే 100 శాతం నమోదు

కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఒక్క కోసిగిలో తప్పా మిగతా చోట్ల నూరు శాతం లక్ష్యాన్ని సాధించలేదు. ఆస్పరిలో 90.23 శాతం. ఆలూరులో 86.13 శాతం, గూడూరులో 83.57 శాతం, కర్నూలులో 84.61 శాతాలు నమోదయ్యాయి. అతి తక్కువగా కల్లూరులో 63.50 శాతం నమోదైంది. కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆదాయ సిద్ధికరణలో అతి ముఖ్యమైనది. అయితే, ఏసీబీ రైడింగ్‌లో సబ్ రిజిస్ట్రార్ పట్టుబడి సస్పెండ్ కావడం, అధికారులు సమయానికి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించకపోవడం ఆదాయం తగ్గడానికి కూడా ఓ కారణమని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	నిర్దేశించిన లక్ష్యం రూ. కోట్లలో	వచ్చిన ఆదాయం రూ. కోట్లలో	శాతం
ఆదోని	48.14	37.72	78.36
ఆలూరు	10.72	34.18	86.13
ఆస్పరి	4.02	3.63	90.23
గూడూరు	14.52	12.13	83.57
కోడుమూరు	19.57	15.41	78.07
కోసిగి	7.78	7.84	100.83
పత్తికొండ	17.18	11.47	66.77
ఓర్వకల్లు	19.98	14.11	70.63
ఎమ్మిగనూరు	26.12	20.82	79.69
కర్నూలు	106.69	90.27	84.61
కల్లూరు	131.51	83.51	63.50

కోవిడ్ ఎఫెక్ట్‌తో వెనుకబడ్డాం



కరోనా ప్రభావంతో 2022-23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యసాధనలో వెనుకబడ్డాం. గతేడాది కంటే రూ. 50.75 కోట్ల ఆదాయం క్షీణించింది. దీంతో వృద్ధి రేటు -2.93 శాతం నమోదైంది. ఈ ఏడాది మొత్తానికి రూ.406.06 కోట్లకు గాను రూ.306.83 కోట్లు వసూలు చేశాం. వచ్చే ఏడాది నూటికి నూరు శాతం ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– నాగమల్లేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

పుంజుకోని రియల్ ఎస్టేట్...

2022-23 ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయాన్ని బట్టి చూస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోలేదని తెలుస్తోంది. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ ఇచ్చిన అంకెలను బట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకున్నట్లు గానీ, పుంజుకోలేదన్నట్లుగా గానీ పరిగణించలేం. అయితే, గతేడాది రిజిస్ట్రేషన్ అయిన డ్యాకుమెంట్లు, ఇతర వివరాలను పరిగణనలోకి తీసుకుంటే చెప్పవచ్చు. గతేడాది 1.56,566 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లు జరగగా ఈ యేడాది 1,30,618 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లు జరిగాయి.



10,11న వాహనాల వేలం

కర్నూలు : అక్రమంగా మద్యం, సారా రవాణా చేస్తూ పట్టుబడిన కేసుల్లో సీజ్ చేసిన 216 వాహనాలను ఏప్రిల్ 10, 11 తేదీల్లో వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 164, సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌లో 52 వాహనాలను ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆయా తేదీల్లో తగిన దరావత్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు ఆధార్ కార్డు జిరాక్స్ కచ్చితంగా తెచ్చుకోవాలని సూచించారు. వేలంపాటలో వాహనం దక్కించుకున్నవారు సంబంధించిన వాహనం ధర మొత్తాన్ని అదే రోజు సంబంధిత అధికారులకు చెల్లించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

4,509.14 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం

కర్నూలు(అగ్రికల్చర్): 2022-23 సంవత్సరంలో 4,509.04 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించారు. 3,700 హెక్టార్లు లక్ష్యం కాగా.. 809 హెక్టార్లకు అధికంగా సూక్ష్మ సేద్యం కల్పించడం విశేషం. డ్రిప్, స్ప్రింక్లర్ల సిస్టమ్స్ విలువ రూ.44.52 కోట్లు ఉండగా.. ప్రభుత్వం రూ.36.15 కోట్లు సబ్సిడీగా ఇస్తోంది. ఇప్పటి వరకు 3,507 మంది రైతులకు సంబంధించి 3,332.57 హెక్టార్లకు డ్రిప్ సదుపాయం కల్పించగా.. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.34.48 కోట్లు భరించింది. 1,077 మంది రైతులకు సంబంధించి 1176.47 హెక్టార్లకు స్ప్రింక్లర్ల(తుంపర్లు) సదుపాయం కల్పించారు. వీటి విలువ రూ.3.16 కోట్లు ఉండగా.. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.1.66 కోట్లు భరించింది. సూక్ష్మ సేద్యం అత్యధికంగా క్రిష్ణగిరి మండలంలో 493.3 హెక్టార్లకు.. తుంపర్ల సేద్యం అత్యధికంగా వెల్దుర్తి మండలంలో 166.95 హెక్టార్లకు కల్పించారు.

మసీదు స్థలం కోసమే హత్య చేశారు

- వీడిన హాల్వి ఉసేన్‌బాషా హత్య కేసు మిస్టరీ
- ఐదుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోని అర్బన్: మసీదు స్థలం దక్కకపోవడంతోనే కౌతాళం మండల హాల్వి గ్రామానికి చెందిన పింజరి హుసేన్‌బాషాను ప్రత్యర్థులు అంతమొందించారు. గత నెల 29న జరిగిన ఈ హత్యను పోలీసులు ఛేదించారు. పట్టుబడిన ఐదుగురి నిందితులను బుధవారం ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. హాల్వి గ్రామానికి చెందిన పింజారి హుసేన్‌బాషా అదే గ్రామంలో ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే గత పదేళ్లుగా మౌలాలిదొడ్డి మసీదు కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. అయితే, ఈ మసీదు స్థలం విషయంలో మసీదు కమిటీకి, అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారులు రవి, నరేష్, రాజశేఖర్ మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంలో కోర్టును ఆశ్రయించగా మసీదు కమిటీకే అనుకూలంగా తీర్పు వెలువడింది. దీంతో నిందితులు రవి, నరేష్, రాజశేఖర్ మసీదు కమిటీ చైర్మన్‌గా ఉన్న హుసేన్‌బాషాపై కక్ష పెంచుకున్నారు. అతనిని చంపితే గానీ మసీదు స్థలం తమకు దక్కదని భావించి హుసేన్‌బాషా దగ్గరి బంధువులైన నిరంజన్, మూలింటి సతీష్‌తో హత్యకు పథకం పన్నారు. వీరి ద్వారా హుసేన్‌బాషా కదలికలను తెలుసుకున్న ప్రత్యర్థులు గత నెల 29వ తేదీన వల్లూరు క్రాస్ రోడ్డు వద్ద అతను వాకింగ్ చేస్తుండగా కంట్లో కారం వేసి అతి కిరాతకంగా నరికి చంపారు. తర్వాత బైకుపై కర్ణాటక వైపు వెళ్లిపోయారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐదురోజుల్లో కేసును ఛేదించారు. నిందితులు ఐదుగురు లాయర్‌ను కలిసేందుకు ఆదోనికి వస్తుండగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, మూడు వేటకొడవళ్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. కౌతాళం, కోసిగి పోలీసులు, సీఐ ఎరిషావలి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పాముకాటుతో బాలిక మృతి



మృతి చెందిన అలకనంద

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాబయ్య, భారతిల కుమార్తె అలకనంద(5) బుధవారం పాముకాటుతో మృతి చెందింది. ఇంటి సమీపంలోని అరుగుపై బాలిక ఆడుకుంటుండగా బండ కింద ఉన్న పాము కాటేసింది. దీంతో గట్టిగా అరుస్తూ ఏడవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే కన్నుమూసింది.

తుంగభద్రలో గల్లంతైన వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహాన్ని బయటకు తెస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

కర్నూలు: స్థానిక నాగసాయి దేవాలయం సమీపంలోని తుంగభద్ర నదిలో గల్లంతైన నేసె నాగరాజు (35) ఆచూకీ బయటపడింది. తుంగభద్ర నది అవతలి ఒడ్డున తన ఎద్దులను కట్టేసి మంగళవారం ఉదయం నది ఇవతలికి వస్తూ దారి తప్పి నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు కనుగొని అతనిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌కు చెందిన ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌కు సంబంధించి ఏఆర్ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొత్తం పది మంది నదిలో సాయంత్రం 5:30 నుంచి 7:30 గంటల వరకు గాలించారు. చీకటి పడటంతో బుధవారం ఉదయమే అదే బృందం అక్కడికి చేరుకుని సుమారు అరగంట పాటు సెర్చింగ్ రెస్క్యూ చేసి మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పండుగలను కలసిమెలసి జరుపుకోవాలి



మాట్లాడుతున్న పోలీసు అధికారులు

కర్నూలు: పండుగలను అన్ని వర్గాల ప్రజలు కలసిమెలసి జరుపుకోవడం ద్వారా మతసామరస్యాన్ని పాటించాలని కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ సూచించారు. వీర హనుమాన్ శోభాయాత్ర, రంజాన్ పండుగలను పురస్కరించుకుని కర్నూలు పాతబస్తీలోని పెద్దమార్కెట్ దగ్గర ఉన్న లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో బుధవారం శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం ఒకటవ పట్టణ సీఐ తిమ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూ ముస్లిం మత పెద్దలతో పాటు పలువురు వ్యాపారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కర్నూలు మతసామరస్యానికి మారుపేరని, హిందువులు ముస్లింలు కలసిమెలసి పండుగలు జరుపుకోవడం ద్వారా గత సాంప్రదాయాన్ని చాటిచెప్పాలని సూచించారు. ఎలాంటి ప్రచారాలను నమ్మవద్దని, ఏవైనా సంఘటనలకు సంబంధించి సమాచారం వస్తే పోలీసులను సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు కల్పించవద్దని సూచించారు. సీఐలు శ్రీనివాసులు, తబ్రేజ్ పాల్గొన్నారు.



పెద్దాసుపత్రి ఎదురుగా బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరి



రాజ్‌విహార్ సర్కిల్‌లో..

చలువ పందిళ్లు

రోజురోజుకు వేసవి తీవ్రత పెరుగుతోంది. సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. గతకొద్ది రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుతుండటంతో వివిధ పనుల మీద బయటకు వచ్చిన వారు వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలోని రాజ్‌విహార్, కలెక్టరేట్, సీక్యాంప్ తదితర ప్రధాన కూడళ్లలో అధికారులు షామియానాలు ఏర్పాటు చేసి నిలువ నీడ కల్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కలెక్టరేట్ ప్రవేశ ద్వారంలో..